# దేవమ్మకు రేషన్ బియ్యం..

### తహసీల్దార్ చొరవపై ప్రశంసలు



**ప్రజాపక్షం/నల్లగొండ :** చూపులేని వృద్ధురాలు నీలం లక్ష్మి దేవమ్మకు ఎట్టకేలకు రేషన్ బియ్యం అందింది.ఇటీవల ప్రజాపక్షంలో ప్రచురితమైన కథనానికి స్పందించిన రెవెన్యూ అధికారులు వెంటనే చర్యలు చేపట్టి ఆమెకు రేషన్ కార్డు సమస్యను పరిష్కరించి రేషన్ బియ్యం అందించారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన నీలం లక్ష్మి దేవమ్మ చూపులేని వృద్ధురాలు. ప్రభుత్వం అందించే ఆసరా పింఛన్ పొందుతున్నప్పటికీ, సాంకేతిక లోపం లేదా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆమె రేషన్ కార్డు రద్దు కావడంతో ఏడాది కాలంగా రేషన్ బియ్యానికి దూరమయ్యారు.ఈ విషయాన్ని ప్రజాపక్షం ప్రముఖంగా ప్రచురించడంతో రెవెన్యూ శాఖ అధికారులు స్పందించారు. లక్ష్మి దేవమ్మకు రేషన్ బియ్యం అందేలా చర్యలు తీసుకోవడం స్థానికులను ఆకట్టుకుంది.అధికారిగా తన బాధ్యతను మానవత్వంతో నిర్వర్తించిన తహసీల్దార్ సేవలను గ్రామస్థులు,ప్రజాప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మి దేవమ్మ తమ్ముడు నీలం వేంకటేషం మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న 'ప్రజాపక్షం' కథనం తో అధికారులు స్పందించి వృద్ధురాలికి న్యాయం చేయడం అభినందనీయమన్నారు.


ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శనివారం | 18 జులై , 2026 | పేజీలు : 5


# సూర్యాపేట అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించండి

### టి.కె.శ్రీదేవికి మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది విజ్ఞప్తి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట మున్సిపాలిటిలో మౌలిక వసతుల అభివృద్ధి, ఇంజనీరింగ్, పరిశుద్ధ్య విభాగంలో ఖాళీ పోస్టుల భర్తీ, త్రాగునీటి సరఫరా మెరుగుదల, యూజిడి పనుల అనంతరం రోడ్ల పునరుద్ధరణతో పాటు శ్రీలింగమంతుల స్వామి గుట్ట చెరువును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది రాష్ట్ర పురపాలక పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్ అండ్ డైరెక్టర్ టి.కె.శ్రీదేవికి విజ్ఞప్తి చేశారు. పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు వివిధ గ్రాంట్ల ద్వారా ప్రత్యేక నిధులు విడుదల చేయాలని కోరారు. మున్సిపాలిటి ఇంజనీరింగ్ విభాగంలో ఖాళీగా టెక్నికల్ పర్సన్ (టిఓ), అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ), పరిశుభ్రత విభాగంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రభావం పడుతుందని వివరించారు. ఈ పోస్టులను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలో తాగునీటి సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు అదనపు పైప్‌లైన్ల ఏర్పాటు కోసం నిధులు అవసరమని, ప్రజలకు నిరంతరాయంగా తాగునీరు అందించేందుకు ప్రభుత్వం సహకరించాలని కోరారు. తెలంగాణలో రెండో అతిపెద్ద జాతరగా పేరు గాంచిన శ్రీలింగమంతుల స్వామి గుట్ట సమీపంలోని చెరువును సుందరీకరించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే పట్టణానికి ప్రత్యేక గుర్తింపు లభించడంతోపాటు పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. ఇదే సందర్భంగా పట్టణంలో జరుగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనుల కారణంగా తవ్విన రోడ్లను ఇప్పటికి పూర్తిస్థాయిలో పునరుద్ధరించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆమె సంబంధిత అధికారులతోపాటు కాంట్రాక్టర్‌తో నేరుగా ఫోన్‌లో మాట్లాడి, రోడ్ల పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. సూర్యాపేట అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంపై



ప్రభుత్వం దృష్టిని ఆకర్షిస్తూ, పట్టణ సమగ్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.



# చేనేత కార్మిక సంఘాలను బలోపేతానికి ప్రభుత్వం కృషి

### ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే బీర్ల

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల చేనేత సహకార సంఘం నూతన అధ్యక్షులుగా ఎన్నికైన చిందం ప్రకాష్ ప్రమాణ స్వీకరణ కార్యక్రమం శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక వాసవి గార్డెన్‌లో జరిగింది. ఈ ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్,ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య హాజరై నూతనంగా ఎన్నికైన చేనేత సహకార సంఘం చైర్మన్ చిందం ప్రకాష్ ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ చేనేత కార్మికులకు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహాకారంతో చేనేత కార్మిక సంఘాలను బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. నేత కార్మికులు కొరకు ప్రభుత్వం నుండి 25 లక్షల షెడ్డు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నూతనంగ ఎన్నికైన చైర్మన్ ప్రకాష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చేనేత సహకార సంఘం అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్, సంజీవరెడ్డి, విమల వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు దశరథగుప్త, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేని రెండు ప్రైవేట్ ల్యాబ్‌లు సీజ్

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: డిఎంహెచ్ఒ

**ప్రజాపక్షం/నల్లగొండ(గుర్రంపోడు):** నిబంధనలకు విరుద్ధంగా,చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్న రెండు ప్రైవేట్ ల్యాబ్‌లను జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు.కేంద్రంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాహుల్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో గణేష్ ల్యాబ్ మరియు బాలాజీ ల్యాబ్లో పలు ఉల్లంఘనలు వెలుగుచూశాయి.ల్యాబ్‌ల రిజిస్ట్రేషన్ గడువు ముగిసినా పునరుద్ధరించకుండా నిర్వహించడం,ల్యాబ్ పరీక్షల్లో గడువు ముగిసిన రియాజెంట్లను వినియోగించడం, భద్రతా,నాణ్యత ప్రమాణాలను పాటించకపోవడం, రోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయడం వంటి లోపాలను అధికారులు గుర్తించారు.దీంతో రెండు ల్యాబ్‌లను సీజ్ చేసి, కార్యకలాపాలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. తనిఖీల్లో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.నాగేష్, ఆరోగ్య విద్య విస్తరణాధికారి ఎ.అంజయ్య గౌడ్,సీసీ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



# రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలి



ప్రత్యేక సహాయ ప్యాకేజీ ప్రకటించాలి:ఎమ్మెల్సీ


వివరాలు మెయిన్‌లో


# నవంబర్‌లో నల్లగొండలో ఎఐకెఎస్ 36వ జాతీయ మహాసభలు

### రైతు వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్త పోరాటానికి కార్యాచరణ



**ప్రజాపక్షం/నల్లగొండ :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తిని దేశవ్యాప్తంగా చాటిచెప్పే లక్ష్యంతో అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను నవంబర్ 18 నుంచి 21 వరకు నల్లగొండలో నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ తెలిపారు. శుక్రవారం నల్లగొండ నగరంలోని ఏచూరి గార్డెన్స్‌లో జరిగిన మహాసభల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతాంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఐక్య ఉద్యమాలకు ఈ మహాసభలు కార్యాచరణ రూపొందిస్తాయని పేర్కొన్నారు.1936 ఏప్రిల్ 11న లక్నోలో స్థాపించబడిన ఏఐకేఎస్ గత 90 ఏళ్లుగా రైతాంగ హక్కుల కోసం పోరాడుతోందని చెప్పారు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటివరకు పలాస (1940), విజయవాడ (1944), ఖమ్మం, గుంటూరు (2010)లలో నాలుగు జాతీయ మహాసభలు జరిగాయని గుర్తు చేశారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి 80 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో వీర తెలంగాణ పోరాటానికి కేంద్రమైన నల్గొండలోనే ఈసారి మహాసభలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాల వల్ల రైతాంగం సంక్షోభంలోకి వెళ్లిందని ఆరోపించారు. అమెరికాతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా జూలై 22న దేశవ్యాప్తంగా గ్రామాల్లో నిరసనలు, ఆగస్టు 10న సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జైల్ భరో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ సమావేశానికి సంఘం జిల్లా అధ్యక్షుడు కామ్రేడ్ సుదర్శన్ అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు, కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, వీరేపల్లి వెంకటేశ్వర్లు, తుమ్మల వీరారెడ్డి, ఎం.డి జహంగీర్, కందాల ప్రమీల,మల్లు లక్ష్మి,మల్లు నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.

## మాడ్గులపల్లి నూతన ఎస్ఐగా సురేష్‌యాదవ్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మాడ్గులపల్లి మండల నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా సురేష్‌యాదవ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై కృష్ణయ్య వీఆర్‌కు బదిలీ కావడంతో, ఆయన స్థానంలో సురేష్ యాదవ్ బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా నూతన ఎస్సై సురేష్ యాదవ్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తానని స్పష్టం చేశారు. చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అంతకుముందు స్టేషన్‌కు చేరుకున్న నూతన ఎస్ఐకి పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు.

## 'సర్' కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/నడిగూడెం:** కేంద్ర ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ సవరణ ప్రక్రియ (సర్) కార్యక్రమంను పకడ్బందిగా నిర్వహించాలని నడిగూడెం మండల ప్రత్యేక అధికారి, డిఎఫ్‌వో దామోదర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు రామాపురం గ్రామంలో నిర్వహిస్తున్న సర్ కార్యక్రమాన్ని తహసిల్దార్ ఎల్ మంగాతో కలిసి పరిశీలించారు. నడిగూడెం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీనందు నిర్వహిస్తున్న ఓటర్ సవరణ సర్ కార్యక్రమంను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఓటర్ సవరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, ఒక్క ఓటు కూడా మిస్ కాకుండా సర్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అధికారులకు, బిఎల్‌వోలుకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దున్న శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి యలక ఉమారాణి, బిఎల్‌వోలు కోటయ్య, కవిత, సవిత, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## లబ్ధిదారులు మార్కెటింగ్‌పై అవగాహన పెంచుకోవాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రధానమంత్రి విశ్వకర్మ లబ్ధిదారులు మార్కెటింగ్, బ్రాండింగ్‌పై అవగాహన పెంచుకోవాలని ఎంఎస్‌ఎంఇ డిఎఫ్ఓ అసిస్టెంట్ డైరెక్టర్ నవీన్ కుమార్, జిఎం డిఐసి భారతి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ప్రధానమంత్రి విశ్వకర్మ లబ్ధిదారులకు ఒక రోజు మార్కెటింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మార్కెటింగ్, ఫైనాన్షియల్ లిటరసీ, ఈకామర్స్, ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈడిసి మేనేజర్ నరేష్, అసిస్టెంట్ మేనేజర్ రాజు, ప్రసాద్, ఆర్‌బిఓ ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్, డొమైన్ నిపుణులు యశ్వంత్, వీరేందర్, భాగ్యరెడ్డి, పుష్యమిత్ర పాల్గొన్నారు.

## సబ్ స్టేషన్‌లో నీటి కొరత

**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలం కంబాలపల్లి గ్రామానికి సుమారు కిలో మీటర్ దూరంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌లో గత రెండు వారాలుగా తీవ్రమైన నీటి కొరత ఏర్పడింది. దింతో విధుల్లో ఉన్న సిబ్బందికి తాగునీరు, రోజు వారి అవసరాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సబ్ స్టేషన్‌లో విద్యుత్ ఎర్తింగ్‌కు అవసరమైన నీరు అందుబాటులో లేకపోవడం కూడా ఆందోళన కలిగిస్తోంది. నీటి సౌకర్యం లేకపోవడంతో సిబ్బంది దూర ప్రాంతాల నుండి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సంబంధిత అధికారులు స్పందించి సబ్ స్టేషన్‌కు శాశ్వత నీటి వసతి కల్పించాలని, సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని స్థానికులు, ఉద్యోగులు కోరుతున్నారు.

## శ్రీవిజయచందర్ రైస్‌మిల్లును మూసివేయాలి




**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల పరిధిలోని రాయినిగూడెం గ్రామ సమీపంలో జాతీయరహదారి 167 ను అనుకుని ఉన్న శ్రీ విజయ చందర్ రైస్‌మిల్లు వల్ల వచ్చే దుమ్ము దూళి వరి పొట్టు కళ్లలో పడటం కారణంగా వాహనాలపై వెళ్లే ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతూ క్షతగాత్రులై వికలాంగులు అవుతున్నందున అధికారులు ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని ఆ రైస్ మిల్లును మూసివేయించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని గానుగబండ గ్రామంలో జరిగిన సిపిఐ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ రైస్ మిల్లు నిర్మాణంలో సరైన నాణ్యత ప్రమాణాలు పాటించకపోగా చుట్టు కనీసం రక్షణ గొడ కూడా కట్టలేదన్నారు. అయినా ఈ మిల్లు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ గాయపడ్డ క్షతగాత్రులను పరామర్శించాలనే సోయి లేకుండా ప్రవర్తించడం బాధకరమన్నారు. లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు కుందూరు వెంకటరెడ్డి, పోకల ఆంజనేయులు, గోదుముల ఈశ్వరచారి, పంగ సైదులు, షేక్ నబీసాబ్, సోమయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మంజీరా గ్యాస్ కనెక్షన్లను పునరుద్ధరించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని యాద్గార్‌పల్లి పరిధిలోని మంజీరా గ్యాస్ గోదాం పరిధిలో ఉన్న పాత కనెక్షన్లను యథావిధిగా పునరుద్ధరించి వినియోగదారుల ఇబ్బందులను తొలగించాలని సిపిఐ నాయకులు చేశారు. శుక్రవారం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు ఆర్డీవోను కలిసి వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. యాద్గార్‌పల్లి గంగదేవమ్మ గుడి సమీపంలో ఉన్న మంజీరా గ్యాస్ గోదాంకు సంబంధించిన వివాదాలు, కోర్టు కేసుల కారణంగా గత ఏడాది కాలంగా ఇక్కడి మూడు వేల గ్యాస్ కనెక్షన్లను వేములపల్లి మండలానికి మార్చారని గుర్తు చేశారు. దీనివల్ల గ్యాస్ సిలిండర్లు దొరక్క వినియోగదారులు రోడ్లపై పడుకుంటూ తీవ్ర అవస్థలు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఈ గ్యాస్ గోదాం తిరిగి ప్రారంభమైనందున యాద్గార్‌పల్లి, కాలువపల్లి, ఆలగడప, ఉట్లపల్లి, తక్కెళ్లపాడు, తడకమళ్ల సహా పది గ్రామాలకు చెందిన మూడు వేల కనెక్షన్లను మళ్లీ మంజీరా గ్యాస్ ఏజెన్సీకే బదిలీ చేయాలని కోరారు. ఈ పది గ్రామాలకు ఈ గోదాం ఎంతో అందుబాటులో ఉంటుందని, వినియోగదారుల సౌకర్యార్థం నాగార్జున థియేటర్ సమీపంలోనే ఆఫీసు కూడా నడుస్తోందని తెలిపారు. ఆర్డీవో వెంటనే స్పందించి పాత కనెక్షన్లను యథావిధిగా ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గువ్వల మట్టయ్య, ఎస్కే రహీం, దోనేటి వెంకటేశ్వర్లు, భాగం శేషయ్య, గువ్వల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లై ఓవర్‌ను వెంటనే పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/చిట్యాలః** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలో 65వ నెంబర్ జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని బిఆర్ఎస్ నాయకులు శుక్రవారం పట్టణంలో నిరసన వ్యక్తం చేశారు. సర్వీస్ రోడ్డులో ర్యాలీని నిర్వహించి ఫ్లై ఓవర్ నిర్మాణ పనుల దగ్గర కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. 2024 జులైలో నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేసి, ఆరు నెలల్లో పనులు పూర్తి చేస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారని, కాని రెండేళ్ళు పూర్తి అయినా పనులు పూర్తి కాకపోవడం చాలా బాధకరమన్నారు. జాతీయ రహదారిపై వెళ్ళే వేలాది వాహనాలు సర్వీస్ రోడ్డు వెంట వెలుతుండం వల్ల పట్టణ ప్రజలు, వ్యాపారులు తీవ్ర అసౌకర్యాలకు గురౌతున్నారని, వ్యాపారాలు దెబ్బ తింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ట్రాఫిక్ సమస్యలు ఏర్పడి గంటల కొద్ది వాహనాలు నిలిచిపోతున్నాయన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని వెంటనే ఫ్లై ఓవర్ పనులు పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. నిరసన తెలిపిన వారిలో మాజీ మున్సిపల్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, సింగిల్ విండో వైస్ చైర్మన్ మెండె సైదులు, నాయకులు జమాండ్ల శ్రీనివాస్‌రెడ్డి బొబ్బల శివశంకర్‌రెడ్డి, జిట్ట బొందయ్య, నిమ్మనగోటి శ్రీనివాస్, షేక్ అజీముద్దీన్, కందాటి రమేష్ తదితరులున్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగే రైతులకు రక్ష




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు తమ సాంప్రదాయ సాగు విధానంలో మార్పులు చేసుకోవాలని, తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ లాభాలు ఇచ్చే ఆరుతడి పంటల వైపు దృష్టి సారించాలని ఏవో రుషేంద్రమణి అన్నారు. మిర్యాలగూడ రైతువేదికలో శుక్రవారం జరిగిన రైతు అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండటంతో బోర్లలో నీటి నిల్వలు తగ్గిపోవడమే కాకుండా, రాబోయే రోజుల్లో చెరువుల ద్వారా లభించే సాగునీరు కూడా లభించడం కష్టంగా మారుతుందన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా తక్కువ తడులతో త్వరగా చేతికి వచ్చే జొన్న, పెసలు, మినుము, కంది, పొద్దుతిరుగుడు, ఆముదం వంటి పంటలను సాగు చేసుకోవడం ఎంతో శ్రేయస్కరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మాలవత్ రమేష్, బీటీఎం గిరి, మండల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** అర్హులైన జిల్లా నిరుద్యోగ అభ్యర్థులు ఎస్‌సి స్టడి సర్కిల్, హైదరాబాద్ యుపిఎస్‌సి ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో టిజిఎస్‌సి స్టడి సర్కిల్, హైదరాబాద్ ద్వారా శిక్షణ పొంది ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్‌ఎస్, గ్రూప్ 1 వంటి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల విజయగాధలతో రూపొందించిన బుక్‌లెట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యుపిఎస్‌సి ఉచిత కోచింగ్ కొరకు ఈనెల 19 వరకు ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నంబర్ 9701775868ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్టడి సర్కిల్ గౌరవ డైరెక్టర్ టి. నాగయ్య పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే పోరుబాట



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ ప్రభుత్వం పెండింగ్ లో ఉన్న బీసీ విద్యార్థుల ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ హెచ్చరించారు. శుక్రవారం మిర్యాలగూడలో నిర్వహించిన విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు రూ. 8 వేల కోట్ల ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉండటం వల్ల 14 లక్షల మంది బీసీ విద్యార్థుల చదువులు అర్ధాంతరంగా ఆగిపోయే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకప్పుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఫీజు రీయింబర్స్మెంట్ పథకం అద్భుతంగా అమలు జరిగితే, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. బీసీ విద్యార్థులకు 10 వేల లోపు ర్యాంకు నిబంధన పెట్టి ఇంజనీరింగ్ చదువులకు దూరం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జక్క నాగేశ్వర్‌రావు, సిద్ధం రాజు, మునగాల శైలేందర్, పట్టేటి రమేష్, ఉపేందర్, రమేష్, శంకర్, నీలిమా, ఉమా, కీర్తి పాల్గొన్నారు.

## 20న కలెక్టర్ కార్యాలయ ముందు ధర్నా

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 20న కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ నీలా రామ్మూర్తి, భవన నిర్మాణ మండల అధ్యక్షులు యారవ శ్రీనివాస్ లు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో భవన నిర్మాన కార్మికులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికులను దగా చేస్తున్నాయని మండిపడ్డారు. హెల్త్ టెస్టుల పేరుతో కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో భవననిర్మాణ కార్మికులు షేక్ సత్తార్, గుంజ రవీందర్, కరీముల్లా, బిక్షం, దుబాయ్‌మేస్త్రీ, ఈశ్వరయ్య, నరేష్, శివ, కరుణాకర్ పాల్గొన్నారు.

## రీ సర్వేపై బొల్లారం పట్టిలో గ్రామసభ

**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలం బొల్లారం పట్టి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గ్రామంలో గ్రామసభను తహశీల్దార్ సత్యనారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. రీ సర్వే ద్వారా భూముల సరిహద్దులు, విస్తీర్ణం, రికార్డులు ఖచ్చితంగా నమోదు చేయబడతాయని తెలిపారు. భూ యాజమానులు తమకు సంబంధించిన పట్టాదారు పాస్ బుక్, ఆధార్‌కార్డు, ఇతర భూ పత్రాలతో వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో గ్రామసర్పంచ్ హన్మ, అనిల్, రెవెన్యూ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## జీతాలు లేక పస్తులుంటున్న వీఆర్ఏల కుటుంబాలు

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం గత ఐదు నెలలుగా వీఆర్ఏలకు జీతాలు రాకపోవడంతో వారి కుటుంబాలు పస్తులుంటున్న పరిస్థితి నెలకొంది. చాలి చాలని జీతాలతో గొడ్డు చాకిరి చేస్తున్నా సమయానికి జీతాలు రాకపోవడంతో వీఆర్ఏల కుటుంబాలు దినదిన గండంగా కాలం వెళ్లదీస్తున్నారు. గుండాల మండలంలో మొత్తం 11 మంది వీఆర్ఏలు ఉండడంతో వారికి జీతాలు రాకపోవడంతో వారి పిల్లల స్కూల్ ఫీజులు భారంగా మారాయని, రోజువారిగా తినడానికి కూడా ఇబ్బందిగా మారిందని ఇప్పటికైన ప్రభుత్వం, అధికారులు స్పందించి వీఆర్ఏలకు జీతాలు సకాలంలో చెల్లించి వారిని ఆదుకోవాలని వీఆర్ఏల మండల అధ్యక్షులు రాజు ప్రభుత్వాన్ని, అధికారులను కోరారు.

## రాములు మృతి బాధాకరం



**ప్రజాపక్షం/డిండి;** డిండి మండలం సింగరాజుపల్లి గ్రామానికి చెందిన పాలే రాములు మృతి బాధాకరం అని దేవరకొండ మాజీ ఎంఎల్‌పి రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం సింగరాజుపల్లి గ్రామంలో రాములు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబసభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ పొనుగోటి రవీందర్‌రావు, జంగయ్య, తులసిరామ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం హామీలను అమలు చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు గీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో ఎల్గూరి గోవింద్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటి సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షన్ రూ.4వేలకు, ఎక్స్‌గ్రేషియా రూ.10లక్షలు పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చి 30 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు దానిని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర బస్సు యాత్ర ఆగష్టు 2న మహబూబాబాద్ (మానుకోట)లో ప్రారంభమై అన్ని జిల్లాల్లో ప్రచారం నిర్వహించి 18న హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ వద్ద ముగుస్తుందన్నారు. యాత్రకు గీత కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అబ్బగాని బిక్షం, గునగంటి కృష్ణ, జెర్రిపోతుల కృష్ణయ్య, బట్టిపెల్లి నాగమల్లయ్య, మండవ సైదులు, బొల్లపల్లి శ్రీనివాస్, గుండగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.




## ఫ్లైఓవర్ అండర్‌గ్రౌండ్ ప్రజల విశ్రాంతి కేంద్రంగా మారుతోంది : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణ అభివృద్ధిలో భాగంగా ఫ్లైఓవర్ అండర్‌గ్రౌండ్ ప్రాంతాన్ని ఆధునిక సదుపాయాలతో కూడిన ప్రజల విశ్రాంతి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఫ్లైఓవర్ అండర్‌గ్రౌండ్ సుందరీకరణ కార్యక్రమంలో భాగంగా నిర్మిస్తున్న పార్కు ప్రాంగణంలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి నిర్వహించిన శంకుస్థాపన, భూమిపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఫ్లైఓవర్ కింద ఉన్న ఖాళీ ప్రాంతాన్ని సుందరంగా అభివృద్ధి చేసి కుటుంబాలతో కలిసి వచ్చే ప్రజలకు అనువైన ప్రదేశంగా మార్చేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పార్కును సందర్శించే ప్రజలకు పరిశుభ్రమైన మరుగుదొడ్ల సౌకర్యం కల్పించడం అత్యవసరమని భావించి పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పట్టణంలో పరిశుభ్రత, పౌరసదుపాయాల మెరుగుదల లక్ష్యంగా మున్సిపాలిటీ ద్వారా పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్‌జి కళాశాలలో డిగ్రీ ప్రవేశాలకు దోస్త్ చివరి అవకాశం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నాగార్జున ప్రభుత్వ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం డిగ్రీలో చేరడానికి దోస్త్ ద్వారా ఆన్ లైన్ దరఖాస్తులను చివరి అవకాశంగా ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఏ, బికామ్, బిఎస్‌సి, బిబిఏ,బిసిఏ కోర్సులలో కొన్ని సీట్లు మాత్రమే ఖాళీ ఉన్నట్లు ఆయన తెలిపారు.ఇప్పటిదాకా దోస్త్ ద్వారా దరఖాస్తు చేయనివారు,ఇంజనీరింగ్,మెడిసిన్ లాంటి ఇతర కోర్సులలో సీట్లు రాని ఆసక్తి,అర్హతగల అభ్యర్థులు ఈనెల 20 నుంచి 26 మధ్యన ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్పెషల్ కేటగిరి అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 27న ఉంటుందని అన్నారు.ఈనెల 30న సీట్ల అలాట్మెంట్ జరుగుతుందని తెలిపారు.ఈనెల 30 నుంచే ఆన్ లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని పేర్కొన్నారు.ఈస్పెషల్ ఫజ్ లో సీట్లు పొందిన వారికి ఆగష్టు 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.ఇతర వివరాలకు 9989897566, 9985824737 నంబర్లను కార్యాలయ పనివేళల్లో సంప్రదించవచ్చని తెలిపారు.

## ఎన్‌జి కళాశాలలో సోహం రియా మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్‌కు చెందిన రోబోటిక్స్ ఇన్ అకాడెమిక్స్ ఆధ్వర్యంలో శుక్రవారం సించిరోనీ సంస్థ సహకారంతో ట్రైన్‌ది ట్రైనర్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమంలో మొత్తం 63 మంది విద్యార్థులు పాల్గొన్నారని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే రోబోటిక్స్ వర్క్‌షాప్‌లకు భవిష్యత్ ట్రైనర్లుగా సిద్ధమయ్యేలా ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. వర్క్‌షాప్‌లో రోబోటిక్స్ ప్రాథమికాలు, ఎలక్ట్రానిక్స్, సెన్సర్లు, మోటార్లు, సర్క్యూట్ బిల్డింగ్,రోబోటిక్ మోడల్ నిర్మాణం వంటి అంశాలపై ప్రాక్టికల్ శిక్షణ అందించామని పేర్కొన్నారు. అంతేకాకుండా, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రోబోటిక్స్‌ను ఎలా సులభంగా బోధించాలి, యాక్టివిటీలను ఎలా నిర్వహించాలి, ఇన్నోవేషన్ చాలెంజ్‌లకు ఎలా మార్గనిర్దేశం చేయాలి అనే అంశాలపై కూడా ప్రత్యేక అవగాహన కల్పించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగాధిపతిడాక్టర్ మెరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎం. వెంకట్ రెడ్డి, డాక్టర్ వి. వెంకటేశం పాల్గొన్నారు.


## మేళ్లచెరువు సబ్ స్టేషన్‌లో కరువైన రక్షణ

**ప్రమాదటంచున మూగజీవాలు**

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో పశువులకు రక్షణ కరువైంది. సబ్ స్టేషన్ చుట్టూ ఎటువంటి రక్షణ గొడ కాని, పెన్సింగ్ కాని లేకపోవడంతో పశువులు యధేశ్చగా లోపలకు ప్రవేశిస్తున్నాయి. ప్రస్తుత వర్షకాలం కారణంగా సబ్ స్టేషన్ లోపలి భాగంఅంతా పచ్చిక (గడ్డి) ఏపుగా పెరిగింది. అది చూసి ఆకలితో ఉన్న మూగజీవాలు మేత కోసం ఆశగా ఆ కాంపౌండ్‌లోకి వెళ్తున్నాయని పశువుల కాపరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక ఓల్టేజీ విద్యుత్ పరికరాలతో అత్యంత ప్రమాదకరంగా ఉండే సబ్ స్టేషన్ ఆవరణలోకి పశువులు వెళ్ల డం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పశువుల పాలకులు తీవ్ర భయందోళనలు చెందుతున్నారు.

**అధికారి నిర్లక్ష్యపు సమాధానం**

ఈ ప్రమాదకర పరిస్థితి పై స్థానిక విద్యుత్ అధికారిని కలిసి వివరంగా వివరించగా ఆయన నుంచి బాధ్యతారాహిత్యమయిన సమాధానం ఎదురైంది. సమస్యను పరిష్కరించాల్సింది పోయి సదరు అధికారి హేళన చేస్తూ మాట్లాడారు. మరీ ఏం చేద్దాం? నువ్వు రిపోర్టర్ కదా రాయి. గోడ లేదని రాయి మరీ




అంటూ బాధ్యతలేని వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ప్రమాదం జరగక ముందే ఉన్నతాధికారులు స్పందించి మేళ్లచెరువు సబ్ స్టేషన్ చుట్టు వెంటనే రక్షణ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు, పశువుల కాపరులు డిమాండ్ చేస్తున్నారు.



## దేశ ఆర్థిక వ్యవస్థలో నాబార్డు ముఖ్యమైన పాత్ర

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** దేశ ఆర్థిక వ్యవస్థలో నాబార్డు ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని డిసిబి జిఎం నర్మదా అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నాబార్డు 45వ వార్షికోత్సవం జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ డి. రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నాబార్డు ద్వారా వ్యవసాయ రంగం, గ్రామీణ అభివృద్ధి, బ్యాంకింగ్ రంగంలో ఎన్నో వినూత్నమైన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల మన్నలను పొందిందన్నారు. మదర్ థెరిస్సా సంస్థ అధినేత ఫాదర్ జూలియన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలోని స్వయం శక్తి సంఘాలు బలోపేతంగా ఎదగడానికి నాబార్డు పాత్ర ఎంతో ఉందన్నారు. అనంతరం ఉత్తమ ఎస్‌హెచ్‌జి అవార్డును లక్ష్మి శ్రీనివాస్‌కు అందజేశారు. టిజిబి సూర్యాపేట బ్రాంచ్ మేనేజర్, కెవికె శాస్త్రవేత్తలు కిరణ్ కుమార్, అక్షత్ పాల్గొన్నారు.

## టిజిఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కొత్తగూడెం జిల్లా పాల్వంచలో నేడు (శనివారం) జరగనున్న తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ గిరిజన సమైక్య జిల్లా కార్యదర్శి గుగులోతు రాజారామ్ ధర్మబిక్షం భవనం నుంచి ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో గిరిజన సమస్యల పరిష్కారానికి గిరిజన సమాఖ్య ఉద్యమిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుంటే ఆందోళనలు తప్పవన్నారు. గిరిజనులకు 10శాతం రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేసింది బిజెపి మోడీ ప్రభుత్వం అన్నారు. రాష్ట్రంలో గిరిజన గ్రామ పంచాయితీల అభివృద్ధికి రూ.1000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు మూడెకరాల భూమి ఇవ్వాలన్నారు. తండాల్లో, గూడాల్లో నివసించే గిరిజనులకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. గిరిజనుల హక్కుల కోసం జరుగు మహాసభలకు సూర్యాపేట జిల్లా నుంచి వేలాది మంది గిరిజనులు మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## దీర్ఘకాలిక సమస్యను తక్షణమే పరిష్కరించిన టూటౌన్ పోలీసులు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని స్వాతంత్ర్య సమర యోధుల భవనంలో వెంకటరమణ అనే వ్యక్తి 2011 నుంచి అద్దెకు నివాసం ఉంటున్నాడు.అయితే గత కొంతకాలంగా అతను భవన యాజమాన్యానికి అద్దె చెల్లించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడు.దీంతో విసిగిపోయిన స్వాతంత్ర్య సమరయోధుల కమిటీ ప్రతినిధులు తమ సమస్యను నల్లగొం డ డిఎస్‌పి శివరాం రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు శుక్రవారం టూటౌన్ ఎస్ఐ సైదాబాబు తక్షణమే స్పందించి స్వయంగా సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం అద్దెదారుడితో చట్టబద్ధమైన విధానంలో మాట్లాడి, కౌన్సిలింగ్ నిర్వహించి భవనాన్ని ఖాళీ చేయించారు.చాలా కాలంగా నలుగుతున్న సమస్యను సకాలంలో స్పందించి పరిష్కరించిన టూటౌన్ ఎస్ఐ సైదాబాబుకు స్వాతంత్ర్య సమరయోధులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ,సేవాభావంతో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు అధికారుల తీరును వారు అభినందించారు.ఈకార్యక్రమంలో ఏఎస్ఐ చంద్రశేఖర్,ఏఎస్ఐ ఉమారాణి,కమిటీ ప్రతినిధి కొప్పు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.





## మైనర్ డ్రైవింగ్ చట్టరిత్యా నేరం

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మైనర్లు మోటారు వాహనాలు నడపడం చట్టరిత్యా నేరమని ఎస్ఐ రత్నం అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్డులో మైనర్ డ్రైవింగ్‌పై పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు బైక్‌లు, ఇతర వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వాహనాలు నడుపుతూ పట్టుబడిన మైనర్లకు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. మరోసారి పట్టుబడితే తల్లిదండ్రులపై మోటారు వాహనాల చట్టం ప్రకారం భారీ జరిమానాలతోపాటు చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## విద్యాభివృద్ధికి కృషి చేస్తా




**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల నూతన మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన అజయ్ కుమార్‌ను శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని, విద్యార్థులకు అన్ని రకాల వసతులు ఉండేలా చూస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో సిఆర్‌పి కేశవులు,గాంధీజీ పాఠశాల డైరెక్టర్ సరికొండ వెంకన్న,ఉపాధ్యాయులు గాదెపాక రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ శుక్రవారం డ్రై డే-ఫ్రైడే పాటించండి

**ప్రజా పక్షం/నకిరేకల్:** దోమల నివారణ,సీజనల్ వ్యాధుల నియంత్రణకు ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రైడే ను తప్పనిసరిగా పాటించాలని నకిరేకల్ మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ ప్రజలకు సూచించారు.నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 12,13వ వార్డుల్లో శుక్రవారం డ్రై డేఫ్రైడే బ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా కమిషనర్ చిట్యాల సతీష్ మాట్లాడుతూ దోమల ఉత్పత్తికి కారణమయ్యే లార్వాలను ప్రారంభ దశలోనే నిర్మూలించడం ద్వారా సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చన్నారు. ప్రతి ఇంట్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.ఈకార్యక్రమంలో వార్డు ఆఫీసర్ మాధవి,శానిటరీ ఇన్స్పెక్టర్ అజ్మీర కిరణ్,పర్యావరణ ఇంజనీర్ నాగరాజు,బిల్ కలెక్టర్ రాము,మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది,వార్డు ప్రజలు పాల్గొన్నారు.



## ధర్మేంద్ర ప్రధాన్‌చే రాజీనామా చేయించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ధర్మేంద్ర ప్రధాన్‌చే రాజీనామా చేయించి సోనం వాంగ్‌చుక్ ప్రాణాలు కాపాడాలని కోరుతూ శుక్రవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రధాన్ రాజీనామా కోరుతూ సోనంవాంగ్‌చుక్ అమరణ నిరాహార దీక్ష 20వ రోజుకు చేరుకున్నా కేం ప్రభుత్వం స్పందించకపోవడం సరైంది కాదన్నారు. ప్రజా ఉద్యమాలను గౌరవించి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేపించి వాంగ్‌చూక్ విలువైన జీవితాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రవేశ పరీక్షలు, ఉద్యోగ పరీక్షలు లీక్ అంశాన్ని ప్రభుత్వాలు తీవ్రంగా పరిగణించాలన్నారు. ఎన్‌టిఏను రద్దు చేసి ప్రవేశ పరీక్షలు రాష్ట్రాలే నిర్వహించుకునేలా స్వయం ప్రతిపత్తి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ లింగంపల్లి భద్రయ్య, ఇతర సంఘాల నాయకులు మట్టిపెల్లి సైదులు, ప్రభాకర్, రేపాక లింగయ్య, షేక్ ఉమర్, పాల్వాయి బిక్షం, కె. యోగానంద, బయ్య దేవేందర్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్యం అందించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఆసుపత్రిలో రోగులకు సరైన వసతులు కల్పించి నాణ్యమైన వైద్యం అందించాలని నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. నల్లగొండ మండలంలోని అన్నెపర్తి మాజీ ఎంపీటీసీ పొగాకు గట్ట య్య కుమారుడు పాము కాటుతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా శుక్రవారం కంచర్ల భూపాల్ రెడ్డి పరామర్శించి మాట్లాడుతూ డాక్టర్లతో ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందించాలని కోరారు.ఆస్పత్రిలో శానిటేషన్ సరిగా లేదని,అపరిశుభ్రత నెలకొన్నదని కనీస మౌలిక సదుపాయాలు లేక రోగులు వారి సహాయకులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు.డాక్టర్లు శానిటేషన్ మౌలిక వసతులు వెంటనే కల్పించాలని వారిని కోరారు. అనంతరం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రమాదం జరిగి చికిత్స పొందుతున్న అదే గ్రామానికి చెందిన మామిడి సురేష్ ను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పట్టణ అధ్యక్షులు భువనగిరి దేవేందర్,మండ ల అధ్యక్షులు దేప వెంకట్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ రావుల శ్రీనివాస్ రెడ్డి, అన్నెపర్తి సర్పంచ్,మేకల అరవింద్ రెడ్డి,ఉపసర్పంచ్ నాగరాజు వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## రూ.80 వేల ఆర్థిక సహాయం అందజేత

**ప్రజాపక్షం/నందికొండ:** మానవత్వాన్ని చాటుతూ ఆపదలో ఉన్న సహోద్యోగికి స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల,కళాశాల బోధన,బోధనేతర సిబ్బంది అండగా నిలిచారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గురుకులం జూనియర్ అసిస్టెంట్ గోగుల ప్రవీణ్ చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న సహోద్యోగులు స్వచ్ఛందంగా విరాళాలు సేకరించి రూ.80 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. నాగార్జునసాగర్ గురుకుల పాఠశాల, కళాశాల బోధన,బోధనేతర సిబ్బంది కలిసి ఈ నిధిని సమీకరించారు.అనంతరం ఉమ్మడి జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారిణి స్వప్న చేతుల మీదుగా గోగుల



ప్రవీణ్‌కు చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా ప్రవీణ్ త్వరగా కోలుకుని విధుల్లో చేరాలని అధికారులు,సహోద్యోగులు ఆకాంక్షించారు. ఆపద సమయంలో తోటి ఉద్యోగికి అండగా నిలిచిన గురుకుల సిబ్బంది సేవాభావాన్ని పలువురు అభినందించారు.

## భూ సమస్యల పరిష్కారం కోసమే లాండ్ రీసర్వే

**ప్రజాపక్షం /చండూరుః** భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే ప్రభుత్వం లాండ్ రీసర్వే నిర్వహిస్తుందని అందుకు ప్రజలందరూ సహకరించాని చండూరు ఆర్‌డిఓ వందనపు శ్రీదేవి అన్నారు. చండూరు మండలంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైన కుమందాన్‌గూడెంలో శుక్రవారం లాండ్ రీసర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి ఆర్‌డిఓ శ్రీదేవి మాట్లాడుతూ కుమందాన్ గూడెంలో ఉన్న రైతులు గ్రామంలో ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామంలోని భూమిని రీసర్వే చేయడం జరుగుతుందని అందుకు గ్రామంలోని రైతులందరూ భూ రీసర్వేకు సహరించాలని అన్నారు. భూముల రీ సర్వే ఏ ఏవిధంగా నిర్వహిస్తారనే కార్యక్రమంపై రైతులకు ఆర్‌డిఓ శ్రీదేవి సవివరంగా వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమాకాంత్ శర్మ , ఆర్ఐ , సర్పంచ్ బొమ్మల సుగుణమ్మ,ఉప సర్పంచ్ ముత్యాలు పాల్గొన్నారు.



## విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

**ప్రజాపక్షం/నకిరేకల్ :** ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నకిరేకల్ పట్టణంలోని చీమల గడ్డ ప్రాథమికోనత పాఠశాలలోని విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. అక్షరా ఫౌండేషన్ చైర్మన్ రేపాల సతీష్ దాతగా వ్యవహరించిన ఈకార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మారుపాక నరసయ్య,ప్రధాన కార్యదర్శి బాణాల రామ్ రెడ్డి,ప్రచార కార్యదర్శి చిక్కుల సుధాకర్,ఆర్గనైజింగ్ కార్యదర్శి రాచకొండ శ్రీధర్,క్లబ్ కార్యవర్గ సభ్యులు సామంతపురి మురళి, పిల్లలమర్రి శ్రీనివాస్,ఒట్టే సైదులు, గౌరవ సలహాదారు పండుగ తిరుమలయ్య,ఆడిట్ కమిటీ సభ్యులు రామచంద్రయ్య పాల్గొన్నారు.





## గురు స్వామి కుటుంబానికి పరామర్శ

**ప్రజాపక్షం/హాలియా:** హాలియాలోని రెండవ వార్డుకు చెందిన పానుగంటి మల్లయ్య గురుస్వామి కుటుంబాన్ని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జై వీర్ రెడ్డి పరామర్శించారు.శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మల్లయ్య గురుస్వామి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన వెన్నంటి నడిచిన ప్రతి కార్యకర్తకు వారి ఆర్థిక స్థితిగతులకు అనుగుణంగా నా వంతు సహాయం అందజేస్తానని చెప్పారు. ఈకార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రావుల శ్రీనివాస్ యాదవ్, కౌన్సిలర్లు కుందూరు వెంకట్ రెడ్డి,చెరుపల్లి ముత్యాలు, చిట్టిపోలు కరుణాసాగర్ పాల్గొన్నారు.

## గీత చైతన్య యాత్రలు జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 2 నుండి 18 వరకు అమరుల యాదిలో నిర్వహిస్తున్న గీతన్నల చైతన్య యాత్రను విజయవంతం చేయాలని ఆసంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు దండంపెల్లి శ్రీనివాస్ కోరారు.శుక్రవారం గీత కార్మికులతో కలిసి ఈదులూరు గ్రామంలో పోస్టర్ ఆవిష్కరించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు గీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి అని గీత కార్మికులసమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈకార్యక్రమంలో ఆసంఘం మండల ఉపాధ్యక్షుడు పనస యాదయ్య గౌడ్,సొసైటీ అధ్యక్షుడు బందారపు అచ్చాలు గౌడ్,పెద్ద గౌడ్ గుడుగుంట్ల వెంకన్న,సొసైటీ సభ్యులు దండంపల్లి సత్తయ్య, గుడుగుంట్ల నగేష్,దండంపెల్లి సత్తయ్య పాల్గొన్నారు

## భూముల రీ సర్వే గ్రామసభ

**ప్రజాపక్షం/నకిరేకల్ :** మండలంలోని అడవిబొల్లారం రెవెన్యూ గ్రామ పరిధిలో రైతుల దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా శుక్రవారం భూముల రీసర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈసందర్భంగా పిఎసిఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ రైతుల మధ్య ఉన్న భూ తగాదాలను, దీర్ఘకాలిక సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు రీసర్వే దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈసర్వే ద్వారా అడవిబొల్లారం గ్రామానికి సంబంధించిన సరిహద్దులను,అలాగే వ్యవసాయేతర భూములను నిక్కచ్చిగా సర్వే చేసి హద్దులు నిర్ధారిస్తారన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈకార్యక్రమంలో తహసిల్దార్ పి.యశ్వంత్ రాజ్,రెవిన్యూ సిబ్బంది,ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రిని తక్షణమే భర్తరఫ్ చేయాలి

**ప్రజాపక్షం/కోదాడ:** దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష పేపర్ లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ అనిశ్చితిలో పడిందని ఈ ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి దర్మేంద్ర ప్రధాన్ వెంటనే భర్త్ రఫ్ చేయాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రవి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరీక్షా వ్యవస్థలో చోటు చేసుకున్న అవకతవకలు, పేపర్ లీకేజీలకు నిరసన గా అమరణ నిరహరదీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షిణిస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆయ న ప్రాణాలను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టామన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రజాపక్షం/దేవరకొండ;** సోలార్ లైన్ మెయింటెనెన్స్ చివరి పనులను పూర్తి చేసేందుకు శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు దేవరకొండలో పూర్తిగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేష్ తెలిపారు. దేవరకొండ పట్టణంతో పాటు కొండభీమనపల్లి, గిరిజానగర్‌తండా, బుల్లిగుట్టతండాలో కరెంట్ ఉండదని పేర్కొన్నారు. సుమారు ఏడు గంటల పాటు విద్యుత్ సరఫరాలకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.



## భూముల రీసర్వేపై అవగాహన

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే భూముల రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆఫీజ్ ఖాన్ అన్నారు. భూముల రీ సర్వే కార్యక్రమం పై శుక్రవారం మండలం, కుదవన్ పూర్ గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భూముల రీ సర్వే వల్ల రైతుల మధ్య ఉన్న గట్ల తగాదాలు,హద్దుల తగాదాల సమస్యలు పోయి భూధార్ కార్డు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసిల్దార్ పరశురాం,మండల పరిషత్ అభివృద్ధి అధికారి యాకూబ్ , మండల వ్యవసాయ అధికారి, డిప్యూటీ తహసిల్దార్, సర్పంచ్, ఉప సర్పంచ్, తదితరులు హాజరయ్యారు.

## క్రమశిక్షణతో చదువు నేర్చుకోవాలి



**ప్రజాపక్షం/హాలియా:** విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన చదువు నేర్చుకోవాలని జిల్లా విద్యాధికారి సుశీందర్రావు అన్నారు. శుక్రవారం మండలంలోని పులుమామిడి ఉన్నత పాఠశాలలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటల లోపు ప్రార్థన సమయానికంటే ముందుగానే ఆయన పాఠశాలకు చేరుకున్నారు. అనంతరం ప్రార్థన సమయంలో విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల సంఖ్య తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గురువులు చెప్పిన చదువును క్రమశిక్షణతో నేర్చుకొని జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై వారికి అందుతున్న భోజనాలపై విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అన్నా బత్తుల శైలజ పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకే ప్రాధాన్యం

**ప్రజాపక్షం/మునుగోడు:** మండల నూతన ఎస్ఐగా శోభన్ బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఇప్పటివరకు కొనసాగిన ఎస్ఐ ఇరుగు రవి సాధారణ బదిలీలో భాగంగా తిప్పర్తి మండలానికి బదిలీ కాగా,ఆయన స్థానంలో గుండాల పోలీస్ స్టేషన్ నుండి మునుగోడు ఎస్ఐగా శోభన్ బాబు బదిలీపై వచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానని,లాఅండ్ ఆర్డర్ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని అన్నారు.ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని తెలిపారు.

## ఎల్.మంగకు సన్మానం

**ప్రజాపక్షం/నడిగూడెం:** నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన తహసిల్దార్ ఎల్.మంగను రత్నవరం గ్రామ సర్పంచ్ దట్ల నాగేశ్వరరావు,మాజీ సర్పంచ్ పసుపులేటి వినయ్‌వర్ధన్, వార్డు మెంబర్ మిరియాల శ్రీను లు శుక్రవారం తహసిల్దార్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తహసిల్దార్‌ను కోరారు. పాలనకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు.

# నీట్ ఫలితాల్లో 'కెఎల్ఎస్' జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ







**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వైద్య విద్య ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రతిష్టాత్మక నీట్ పరీక్షా ఫలితాల్లో స్థానిక కేఎల్ఎస్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి విద్యా రంగంలో పట్టు నిలుపుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బికుమళ్ల కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తమ విద్యార్థిని రమావత్ అనిత 1356వ ర్యాంకు సాధించగా, రమావత్ హాసిని 3734వ ర్యాంకు దక్కించుకుని జూనియర్లకు ఆదర్శంగా నిలిచారు. వీరితో పాటు కళాశాలకు చెందిన మరో పది మంది విద్యార్థులు, ఐదుగురు విద్యార్థులు పది వేల లోపు ర్యాంకులు సాధించగా, నలుగురు విద్యార్థులు 20 వేల లోపు ర్యాంకులతో తమ సత్తా చాటారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఫలితాలు విడుదలైన అనంతరం కళాశాల ప్రాంగణంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో ప్రతిభ కనబరిచిన ర్యాంకర్లను శాలువాలు కప్పి అభినందించారు. క్రమశిక్షణతో కూడిన బోధన, విద్యార్థుల కఠోర శ్రమ వల్లే ఈ అద్భుత విజయాలు సాధ్యమయ్యాయని యాజమాన్యం పేర్కొంది. డైరెక్టర్లు హన్మంతరెడ్డి, పీఎల్ఎన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, చైతన్య, ర్యాంకర్లు సుహానా, సంజన, సిరి, మేఘన, దీపిక, సంజన, మానస పాల్గొన్నారు.

# నీట్‌లో 'ఎస్ఆర్' విద్యార్థికి ఆలిండియా 9వ ర్యాంకు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** దేశ వ్యాప్తంగా విడుదలైన నీట్ 2026 ఫలితాల్లో ఎస్ ఆర్ విద్యాసంస్థలు మరోసారి ప్రతిభ చాటాయి. ఆ సంస్థ విద్యార్థి వీరయ్య సహ్యా ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 9వ ర్యాంకు సాధించి రాష్ట్రాము తో పాటు దేశానికి గర్వ కారణముగా నిలిచాడు. 720 మార్కులకు గాను 705 మార్కులతో ఈ ఘనత సాధించాలని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వరదారెడ్డి తెలిపారు.అదేవిధంగా పట్టణంలోని రామగిరి బ్రాంచ్ ఎస్ఆర్ కాలేజీలో నీట్ లాంగ్ టర్మ్ 16 మంది విద్యార్థిని విద్యార్థులకు గాను 12 మందికి ఎంబిబిఎస్ ర్యాంక్ లు సాధించారు.ఈ సందర్భంగా నల్లగొండ ఎస్ఆర్ కాలేజీ జోనల్ ఇంచార్జ్ దోనల శ్రీనివాస్ రెడ్డి ఎంబిబిఎస్ ర్యాంకులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను కళాశాల ఉపాధ్యాయ బృందంతో కలిసి అభినందించారు. విద్యార్థిని,విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన ప్రణాళికాబద్ధమైన శిక్షణ,అధ్యాపకుల నిరంతర మార్గదర్శకత్వం,విద్యార్థుల పట్టుదల వల్లే ఈ విజయం సాధ్యమైందన్నారు.

# ఘనంగా జగిని టెక్స్‌టైల్స్ 69వ వార్షికోత్సవం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పట్టణంలోని ప్రముఖ వస్త్ర విక్రయ సంస్థ శ్రీ జగిని టెక్స్‌టైల్స్ 69వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సంస్థ ఆవరణలో బంపర్ లక్కీ డ్రా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా నల్లగొండ ఆర్‌డిఓ వై.అశోక్‌రెడ్డి హాజరై లక్కీ డ్రాను నిర్వహించి విజేతలను ప్రకటించారు. స్థానిక కార్పొరేటర్ హాజీ ప్రత్యేక అతిథిగా పాల్గొని విజేతలకు అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఆర్‌డిఓ వై.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వినియోగదారుల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ దాదాపు ఏడు దశాబ్దాలుగా విజయవంతంగా సేవలందిస్తున్న జగిని టెక్స్‌టైల్స్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ బంపర్ లక్కీ డ్రాలో హోండా యాక్టివా స్కూటర్ బంపర్ బహుమతిని లక్కీ కూపన్ నంబర్734 కలిగిన ఎం.వంశీకృష్ణ ( జన్నారెడ్డి) గెలుచుకున్నారు. కన్సోలేషన్ బహుమతులను లక్కీ కూపన్ నంబర్1139 కలిగిన ఎం. నాగేంద్ర, లక్కీ కూపన్ నంబర్0129 కలిగిన రాచమళ్ళ సాషా దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు,సిబ్బంది,పట్టణ ప్రముఖులు,వ్యాపారవేత్తలు,పెద్ద సంఖ్యలో వినియోగదారులు పాల్గొని విజయవంతం చేశారు. లక్కీ డ్రా సందర్భంగా వినియోగదారులు ఉత్సాహంగా పాల్గొనడంతో సంస్థ ఆవరణ సందడిగా మారింది.

# చండూరులో ఎఐటియుసి నల్లగొండ జిల్లా 11వ మహాసభ కరపత్రాలు విడుదల



**ప్రజాపక్షం/చండూరు:** ఈ నెల 19వ తేదీన గుర్రంపూడు మండల కేంద్రంలో జరిగే ఏఐటియుసి నల్లగొండ జిల్లా 11వ మహాసభను జయప్రదం చేయాలని ఏఐటియుసి మాజీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నల్పరాజు సతీష్ కుమార్ కార్మికులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన చండూరులో కార్మికులతో కలిసి ఏఐటియుసి జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ భారతదేశాన్ని బ్రిటీష్ వారు పరిపాలిస్తున్న సమయంలో దేశంలోని కార్మికులను ఐక్య పరిచి 1920 అక్టోబర్ 31న బొంబాయి నగరంలో ఏఐటియుసి ఆవిష్కరించిందని అన్నారు. నాటి నుంచి నేటి వరకు కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు నడుపుతుందని అన్నారు. అంగన్వాడీ ,ఏఎన్ఎం , ఆశ, 104, 108, ఆర్‌టిసి ,మధ్యాహ్న భోజనం ,హాస్పిటల్ , హమాలీ ,ఆటో,భవన నిర్మాణ రంగం , గ్రామ పంచాయితీ మున్సిపాలిటీ కార్మికులు ,లారీ డ్రైవర్లు,పెయింటింగ్ ,సెంట్రింగ్ ,టైల్స్ ,మార్బుల్ ,ఇతర రంగాల కార్మికుల వేతనాలు పెరగక ఉపాధి దొరకకా చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి బరిగెల వెంకటేశ్ ,ఏఐటియుసి మండల అధ్యక్షుడు భూతరాజు దేవదాస్ ,సంఘం కార్యదర్శి దోటి వెంకన్న, పేర్ల గురుస్వామి , నెల్లికంటి శంకర్, ఎస్ రవి, భూతరాజు శ్రీను, మధు, పనస లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



## భూ సంబంధిత సమస్యలు పరిష్కరించుకోవాలి

**ప్రజాపక్షం/హాలియా:** భూ సంబంధిత సమస్యలను రైతులు ఎప్పటికప్పుడు పరిష్కరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం మండలంలోని ముక్క మాల, వెంకటాద్రిపాలెం గ్రామాలలో నిర్వహించిన భూ పునర్ సర్వే అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలికంగా అపరిృతంగా ఉన్నటువంటి భూముల సమస్యలను ఈ అవగాహన సదస్సులు అధికారులు దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని మునుముందు భూ సమస్యలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. భూ పునర్ సర్వే అవగాహన సదస్సును రైతులు ఎలా సద్వినియోగం చేసుకోవాలో చెప్పాల్సిన బాధ్యత అధికారులకు ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ చంద్రరావు, ముక్క మాల సర్పంచ్ కుక్కల వెంకటయ్య, ఉపసర్పంచ్ కిలారి శ్రీనివాస్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ విగ్నేశ్వర్ రెడ్డి, సర్వేయర్ పోకల విజయ్, గ్రామ కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ డైరెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/నకిరేకల్ (కట్టంగూర్):** గ్రామానికి చెందిన వెల్డింగ్ కార్మికుడు చిలకమర్రి కోటిపై దాడి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మార్కెట్ డైరెక్టర్ గుండు పరమేశును వెంటనే పదవి నుంచి తొలగించి,చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విశ్వకర్మ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాయబండి పాండురంగాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం బాధితుడు కోటి,ఆయన కుటుంబ సభ్యులు, విశ్వకర్మ సంఘ నాయకులతో కలిసి కట్టంగూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు.కట్టంగూర్‌లోని ఓమురమురాల ఫ్యాక్టరీ యజమాని గుండు పరమేశు, ఆయన ఇద్దరు కుమారులు చిలకమర్రి కోటిని పిలిపించి గదిలో నిర్బంధించి దాడి చేశారని ఆరోపించారు.బాధ్యులపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని వారు కోరారు.ఈ సందర్భంగా పాండురంగాచారి మాట్లాడుతూ బాధితుడికి న్యాయం జరిగే వరకు విశ్వకర్మ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ మండల అధ్యక్షుడు విశ్వనాధుల జానాచారి, మండల నాయకులు నర్సింగోజు భిక్షమాచారి,నాగోజు వెంకటాచారి,నాగోజు వసంతాచారి,కేమోజు రామాచారి,చోల్లేటి లింగాచారి, గడగోజు నరసింహాచారి పాల్గొన్నారు.

## విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని,లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా దశలవారీ ఉద్యమాలు చేపట్టి విద్యార్థి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని పిడిఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కె.పవన్ కుమార్ హెచ్చరించారు.శుక్రవారం నల్గొండ పట్టణంలోని సంఘం కార్యాలయంలో జిల్లా నాయకుడు జి.సైదులు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్య ప్రతి విద్యార్థికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, కానీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వేలాది మంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులతో ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**నూతన జిల్లా కమిటీ ఎన్నిక :** ఈ సందర్భంగా పిడిఎస్‌యూ నల్గొండ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షుడిగా జి.సైదులు,జిల్లా ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్, జిల్లా కోశాధికారిగా జగన్ ఎన్నికయ్యారు.అలాగే కార్తీక్, రాజు,ఈశ్వర్, నీలేష్,గోపీకృష్ణ,రేవంత్,తరుణ్, గణేష్ తదితరులతో పాటు మొత్తం 11 మంది సభ్యులతో నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు.